**మార్పు:** మళ్లీ మొదలైన క్యూలైన్లు



కుంటాల పీఏసీఎస్ వద్ద యూరియా కోసం క్యూకట్టిన రైతులు , వరుసలో ఆధార్ కార్డులు

# యూరియా కోసం రైతుల బారులు

- నిర్మల్ జిల్లా కుంటాలలో పడిగాపులు
- కేసీఆర్ పాలనలో కనిపించని క్యూలు

కుంటాల, జనవరి 16: పదేండ్లుగా కనిపించని రైతుల బారులు మళ్లీ మొదలయ్యాయి. సంక్రాంతి పండుగ పూట యూరియా కోసం రైతులు పడిగాపులు కాశారు. నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఎదుట సోమవారం పెద్ద ఎత్తున లైన్లలో నిలబడ్డారు. యూరియా కోసం మండలంలోని కల్లూరు, లింబాకే, అంబకంటి, పోలా, సూర్యాపూర్, మెదన్‌పూర్, అందకూర్, కుంటాల గ్రామాలకు చెందిన దాదాపు 300కుపైగా రైతులు వచ్చారు. సోమవారం ఉదయాన్నే వృద్ధులు, మహిళలు పిల్లాపాపలతో వచ్చి, నిలబడే ఓపిక లేకపోవడంతో ఆధార్ కార్డులు క్యూగా పెట్టారు. ఉదయం 10 గంటలకు స్టాక్ పంపిణీ మొదలు కావడంతో ఒక్కసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అందరూ ఒక్కసారిగా ఎగబడడంతో అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ మొదలుపెట్టారు. 450 బ్యాగుల స్టాక్ మాత్రమే ఉండటంతో యూరియా సరిపోతుందో లేదోనని ఆందోళనకు గురయ్యారు. వరి, మక్కకు యూరియా అధికంగా అవసరం అవుతుండటంతో అన్నదాతలు పరుగులుపెడుతున్నారు. మధ్యాహ్నం వరకు యూరియా పంపిణీ చేశారు. పదేండ్ల కేసీఆర్ సర్కారు హయాంలో ఎప్పుడూ యూరియా కొరత రాలేదని, ఇలా ఎప్పుడూ నిలబడ లేదని రైతులు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు కోరారు. మంగళవారం నిర్మల్ డీఏవో అంజీ ప్రసాద్ పీఏసీఎస్‌ను సందర్శించారు. స్టాక్ ఉన్నదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

# విద్యుత్తు చార్జ్!

మొదటిపేజీ తరువాయి...

నవంబర్ లోగా.. వచ్చే ఆర్థిక సంవత్సరపు ఆదాయానికి సంబంధించిన అంచనాలను డిస్కంలు విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి అందజేయాలి. వాటి ఆధారంగా ఈఆర్సీ డిస్కంల ఆదాయ అవసరాలను పరిశీలిస్తుంది. సదరు ఆదాయ అంచనాలను చేరుకునేందుకు రాబట్టుకోవాల్సిన విద్యుత్తు చార్జీలను కూడా ఈఆర్సీ ప్రకటిస్తుంది. తాజా గెజిట్‌లో పొందుపర్చిన నిబంధనల ప్రకారం.. ఇకపై ఈఆర్సీ ఆమోదించే ఆదాయ అవసరాల మొత్తానికి (ఏఆర్ఆర్).. అలాగే విద్యుత్తు చార్జీలతో వచ్చే ఆదాయ అంచనాలకు మధ్య ఎలాంటి తేడా ఉండకూడదు. కేవలం ప్రకృతి వైపరీత్యాల సమయంలో మాత్రమే ఈ తేడా కేవలం మూడు శాతం లోపు మాత్రమే ఉండవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే.. డిస్కంల వ్యయానికి.. వచ్చే ఆదాయానికి మధ్యన ఎలాంటి తేడా ఉండకూడదన్నమాట. అలా జరగాలంటే.. తమ వ్యయానికి అయ్యే మొత్తాన్ని విద్యుత్తు చార్జీల రూపంలో వసూలు చేసుకొనేలా ఈఆర్సీలు ఆమోదం తెలపాల్సి ఉంటుంది.

### లేట్ పేమెంట్ కూడా వినియోగదారులనుంచే!

ఒకవేళ విద్యుత్తు ఉత్పత్తి కంపెనీలకు చెల్లించాల్సిన సొమ్మును గడువులోగా డిస్కంలు చెల్లించకపోతే.. అవి విధించే లేట్ పేమెంట్ సర్‌చార్జీతోపాటు.. ఆదాయ వ్యత్యాసాన్ని కూడా కలిపి వచ్చే మూడేండ్లలో మూడు సమ వాయిదాల్లో వసూలు చేసుకోవచ్చని తాజా నిబంధనల్లో స్పష్టం చేశారు. ఈ గెజిట్ అమల్లోకి రాకముందు ఉన్న ఆదాయ వ్యత్యాసాలు, లేట్ పేమెంట్ సర్‌చార్జీలను వచ్చే ఏడేండ్లలో ఏడు సమ వాయిదాల్లో వినియోగదారుల నుంచి వసూలు చేసుకోవాలని అందులో స్పష్టం చేశారు. దీనితోపాటు.. ఏదైనా విద్యుత్తు ఉత్పత్తి కంపెనీ/కాప్టివ్ విద్యుత్తు ప్లాంటు/ఎనర్జీ స్టోరేజీ వ్యవస్థ తమ అవసరాల కోసం ప్రత్యేక ట్రాన్స్‌మిషన్ లైన్లను ఏర్పాటు చేసుకొనేందుకు, నిర్వహణ, గ్రిడ్‌తో అనుసంధానం కోసం ప్రత్యేకంగా లైసెన్స్ తీసుకోవాల్సిన అవసరం లేదని తాజా గెజిట్‌లో పేర్కొన్నారు. అయితే వాటి సామర్థ్యం అంతరాష్ట్ర ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ పరిధిలో 25 మెగావాట్లు, రాష్ట్ర అంతర్గత ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ పరిధిలో 15 మెగావాట్లకు మించకూడకుండా ఉండాలి. ఇదంతా సాంకేతిక ప్రమాణాలు, మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం ఉంటుంది. అన్ని రకాల ఓపెన్ యాక్సెస్ వినియోగదారులపై విధించే అదనపు సర్‌చార్జీలు, డిస్కంలు కొనుగోలు చేసే విద్యుత్తుకు సంబంధించిన ఫిక్స్‌డ్ చార్జీలకు మించకుండా ఉండలని అందులో పొందుపర్చారు.

# యాసంగి ఎండుడే!

- వేగంగా తగ్గుతున్న భూగర్భ జలాలు
- నిరుడితో పోల్చితే 1.47% తగ్గుదల
- త్వరలో మరింత లోతుకు పడిపోయే అవకాశం
- క్రమం తప్పకుండా చెరువులు నింపిన కేసీఆర్ సర్కారు
- ఈ ఏడాది ఇప్పటికీ చర్యలు చేపట్టని కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రాజెక్టులే కాదు బోర్ల కింద సాగు కూడా కష్టమే

**మార్పు:** పంటలు బంద్!

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఈ ఏడాది యాసంగి సాగులో రైతన్నలు కష్టాల పాలయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే కృష్ణా బేసిన్‌లో పలు ప్రాజెక్టులకు క్రాప్ హాలిడే ప్రకటించగా, గోదావరి బేసిన్‌లోనూ పరిస్థితి ఆశించినంత మెరుగ్గా ఏమీ లేదు. ఇప్పటివరకు కాళేశ్వరం ప్రాజెక్టు అండగా నిలవగా, ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో యాసంగిసాగు కష్టంగానే కొనసాగే పరిస్థితులు నెలకొన్నాయి. చెరువులు, బోరుబావుల కింద కూడా సాగు ప్రశ్నార్థకంగా మారేలా ఉన్నది.

### కాళేశ్వరం ప్రాజెక్టే కీలకం

చెరువులను నింపడంలో ఇప్పటివరకు కాళేశ్వరం ప్రాజెక్టే కీలక భూమికను పోషించింది. 2019లో ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి గోదావరి జలాలను పరిపూర్ణంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. ఆ ప్రాజెక్టుతో ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, నిజాంసాగర్, సింగూరు, ఎగువ మానేరు, దిగువ మానేరు, కడెం, వరదకాలువ తదితర ప్రాజెక్టులను అనుసంధానించారు. తద్వారా ఆయా ప్రాజెక్టులకు జలకళ రావడమేగాక, వాటికింద ఉన్న చెరువులను కూడా గతంలోని కేసీఆర్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు నీటితో నింపింది. వరంగల్ జిల్లాలో చెరువులను దేవాదుల ప్రాజెక్టుతో అనుసంధానిస్తున్నారు. రామప్ప, లక్నవరం, పాకాల వంటి కాకతీయులు నిర్మించిన చారిత్రక జలాశయాలను కూడా దేవాదులలో భాగం చేశారు. ఖమ్మం జిల్లాలోనూ సీతారామ, భక్తరామదాసు ఎత్తిపోతల పథకాలతో లింకు కలిపి ఏడాది పొడవునా నింపుతూ వచ్చారు. ఒక్కమాట చెప్పాలంటే తెలంగాణ మూలమూలకు గోదావరి జలాలను కేసీఆర్ సర్కారు తరలించింది. ఫలితంగానే సాగు విస్తీర్ణంలో తెలంగాణ రికార్డు నమోదు చేసింది. చెరువులను, చెక్‌డ్యామ్‌లను క్రమం తప్పకుండా నింపడం వల్లనే భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. ఫలితంగానే 30 లక్షల బోర్ల కింద ఎవుసం ఇప్పటివరకు పండుగలా సాగింది. కాళేశ్వరం ప్రాజెక్టు రెండు పంటలకు భరోసా ఇచ్చింది.

### ఇప్పటికే 1.47 శాతం తగ్గిన భూగర్భజలాలు

ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ నాటికి 852 మిల్లీమిటర్ల సాధారణ వర్షపాతానికి గాను 914 మిల్లిమీటర్లు నమోదయింది. ఇది సాధారణంకంటే 7 శాతం అధికం. అయినప్పటికీ గత ఏడాది ఇదే సమయంతో పోల్చితే 1.47 శాతం మేరకు భూగర్భజలాలు ఇప్పటికే తగ్గిపోయాయి. రాబోయే రోజుల్లో మరింత లోతుకు పోయే పరిస్థితి కనిపిస్తున్నది. ప్రస్తుతం సగటు భూగర్భ జలమట్టం 6.80 మీటర్లు ఉన్నది. గత ఏడాది ఇదే సమయంలో 30 జిల్లాల్లో సగటు భూగర్భ జలమట్టం 0.32 నుంచి 4.60 మీటర్లుగా ఉండడం గమనార్హం. ప్రస్తుతం 7 జిల్లాలో మాత్రమే 5 మీటర్ల కంటే తక్కువ లోతులో భూగర్భజలాలు ఉండగా, మిగిలిన అన్ని జిల్లాల్లోనూ 5-10 మీటర్ల లోతుకు పడిపోయాయి. అందుకు ప్రధాన కారణంగా చెరువులను నింపకపోవడమేనని నిపుణులు అంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్రమం తప్పకుండా చెరువులను, చెక్‌డ్యామ్‌లను నింపడం వల్ల మండువేసవిలోనూ భూగర్భజల మట్టం పడిపోకుండా ఉన్నదని చెప్తున్నారు.

### చెరువులపై దృష్టి పెట్టని కాంగ్రెస్ సర్కారు

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చెరువులను నింపడంపై ఇప్పటికీ దృష్టి సారించలేదు. కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయాలనేదానిపై చూపెట్టిన ఉత్సాహాన్ని చెరువులపై పెట్టలేదు. మేడిగడ్డలోని లక్ష్మీబరాజ్, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడేనాటికి నీళ్లు ఉన్నాయి. ఆ నీళ్లను లిఫ్ట్ చేసి చెరువులను, చెక్‌డ్యామ్‌లను నింపలేదు. బరాజ్ కుంగుబాటు ఘటనను భూతద్ధంలో చూపేందుకు ఎలాంటి ఆలోచన చేయకుండా నీళ్లను దిగువకు విడుదల చేసింది. మొత్తంగా ఇప్పుడు బరాజ్‌లను ఖాళీ చేసింది. ఇక ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, ఎల్ఎండీ, మల్లన్నసాగర, కొండపోచమ్మసాగర్‌లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు ఉన్నా కూడా ఇప్పటికీ చెరువులను నింపడం లేదు. ప్రధాన కాలువల ద్వారా మాత్రమే కొన్ని ప్రాంతాలకు సాగునీళ్లను ఇస్తున్నది. దీంతో ఆయా చెరువుల కింద రెండో పంట సాగు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

### కొన్ని ప్రధాన ప్రాజెక్టులు, అనుసంధానిత చెరువులు

| ప్రాజెక్టు | చెరువుల సంఖ్య |
|---|---|
| కాళేశ్వరం | 846 (ప్రధాన కాలువలతో) |
| ఎస్సారెస్పీ 1 | 1,304 |
| ఎస్సారెస్పీ 2 | 843 |
| నాగార్జునసాగర్ | 574 |
| దేవాదుల | 2,000 |
| నిజాంసాగర్ | 313 |
| ఎస్ఎల్‌బీసీ | 251 |
| సింగూరు | 167 |
| కోయిల్‌సాగర్ | 107 |
| కడెం | 115 |
| ఎల్లంపల్లి | 122 |
| భక్తరామదాసు | 172 |
| జూరాల | 185 |
| భీమా | 143 |
| నెట్టెంపాడు | 103 |
| రాజరాజేశ్వర | 100 |
| అలీసాగర్ | 84 |
| గుత్ప | 68 |
| చౌటుపల్లి హన్మంతరెడ్డి | 28 |
| ఎస్సారెస్పీ వరద కాల్వ | 30 |
| కల్వకుర్తి | 40 |
| ఆసిఫ్‌నహర్ | 63 |

(నోట్: ఇవి గత ఏడాది వరకు అనుసంధానించినవే. ప్రస్తుతం అందుకు సంబంధించి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలవారీగా పూర్తి లెక్కలను తీస్తున్నారు)

### భూగర్భ జలమట్టం పడిపోయిన జిల్లాలు.. (మీటర్లలో)

| జిల్లా | నిరుడు | ఈ ఏడాది (మీటర్లలో) |
|---|---|---|
| భద్రాద్రికొత్తగూడెం | 7.02 | 7.05 |
| భూపాలపల్లి | 6.86 | 7.63 |
| హనుమకొండ | 3.63 | 5.03 |
| హైదరాబాద్ | 5.84 | 7.60 |
| జగిత్యాల | 3.86 | 3.94 |
| జనగాం | 4.53 | 5.39 |
| జోగులాంబ | 4.90 | 5.58 |
| కామారెడ్డి | 7.08 | 9.31 |
| కరీంనగర్ | 5.16 | 6.64 |
| ఖమ్మం | 3.84 | 4.75 |
| కుమ్రంభీం | 5.83 | 6.43 |
| మహబూబాబాద్ | 3.58 | 4.54 |
| మహబూబ్‌నగర్ | 4.14 | 8.24 |
| మంచిర్యాల | 4.68 | 4.57 |
| మెదక్ | 7.33 | 9.21 |
| మేడ్చల్ | 6.33 | 8.50 |
| నాగర్‌కర్నూల్ | 4.42 | 7.91 |
| నల్లగొండ | 4.65 | 7.84 |
| నారాయణపేట | 4.17 | 7.32 |
| నిర్మల్ | 5.49 | 6.49 |
| నిజామాబాద్ | 7.43 | 8.80 |
| పెద్దపల్లి | 4.50 | 4.58 |
| రంగారెడ్డి | 5.49 | 8.68 |
| సంగారెడ్డి | 8.49 | 8.65 |
| సిద్దిపేట | 6.34 | 7.96 |
| రాజన్నసిరిసిల్ల | 5.27 | 7.36 |
| సూర్యాపేట | 3.94 | 5.88 |
| వికారాబాద్ | 8.21 | 11.31 |
| వనపర్తి | 2.88 | 4.75 |
| వరంగల్ | 3.13 | 3.58 |
| యాదాద్రి | 3.97 | 6.01 |

- గుర్రంపై ఎమ్మెల్యే పాయల్ శంకర్ సవారీ

ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం గుర్రంపై ఊరేగారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం స్థానికుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే బేల మండలంలోని కొద్దూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి అలంకరించిన గుర్రంపై కుర్చొబెట్టి ఊరేగించారు. ఎమ్మెల్యే గుర్రంపై ఉండగానే కొద్దిసేపు గుర్రంతో నాట్యం చేయించారు. -ఆదిలాబాద్, జనవరి 16(నమస్తే తెలంగాణ)

# చెక్‌డ్యామ్ పేల్చివేతకు కుట్ర?

- జిలెటిన్‌స్టిక్స్‌తో బ్లాస్ట్ చేసేందుకు గుర్తుతెలియని వ్యక్తుల యత్నం
- సమీప రైతులు గమనించడంతో పేలుడు సామగ్రి వదిలేసి పరార్
- సాగునీటి కోసం దిగువ రైతుల చర్యగా అనుమానం
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**మార్పు:** రైతుల తిరుగుబాటు

పెద్దపల్లి జిల్లా భోజన్నపేట శివారులోని చెక్‌డ్యామ్ వద్ద దొరికిన జిలెటిన్‌స్టిక్స్, కంప్రెషర్ మిషన్

పెద్దపల్లి రూరల్, జనవరి 16: పెద్దపల్లి జిల్లా భోజన్నపేటలో చెక్‌డ్యామ్ పేల్చివేతకు కుట్ర జరిగింది. హుస్సేన్‌మియా వాగుపై నిర్మితమైన ఈ చెక్‌డ్యామ్‌ను జిలెటిన్ స్టిక్స్‌తో పేల్చివేసేందుకు గుర్తుతెలియని వ్యక్తులు ప్రయత్నించారు. అందులో భాగంగా సోమవారం రాత్రి 11 గంటల సమయంలో బండ్‌కు కంప్రెషర్ మిషన్‌తో హోల్స్ వేస్తున్న వారిని సమీపంలోని రైతులు గమనించడంతో పేలుడు సామగ్రిని అక్కడే వదిలేసి ట్రాక్టర్‌తో పరారయ్యారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని చెరువులకు ఎంతో అండగా నిలిచిన కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రభుత్వం మరమ్మతుల పేరిట నీటిని తోడేయడం, భూగర్భ జలాలు అడుగంటి యాసంగి పంటలకు సాగునీరు అందకపోవడంతో ఈ చెక్‌డ్యామ్ నుంచి నీటిని మళ్లించుకునేందుకు దిగువ ప్రాంతంలోని భూముల రైతులే ఈ చర్యకు పాల్పడినట్టు తెలుస్తున్నది. దీనిపై ఎస్సారెస్పీ అధికారులు ఫిర్యాదు చేయడంతో పెద్దపల్లి సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ మల్లేశం చెక్‌డ్యామ్ వద్దకు వెళ్లారు. దుండగులు వదిలేసిన 11 జిలెటిన్ స్టిక్స్, కంప్రెషర్ మిషన్‌ను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని, వారు ఎంతటివారైనా కఠిన చర్యలు చేపడతామని సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. హుస్సేన్‌మియా వాగులో వృథాగా పోతున్న నీటిని కొత్తపల్లి, భోజన్నపేట, మూలసాల, చీకురాయి గ్రామాల సాగునీటి అవసరాలకు వినియోగించేందుకు 2018లో రాష్ట్ర ప్రభుత్వం భోజన్నపేట- మూలసాల మధ్య రూ.4.19 కోట్ల వ్యయంతో ఈ చెక్‌డ్యామ్‌ను నిర్మించింది.

### కఠిన చర్యలు తీసుకోవాలి

మా ఊరి పక్కనే హుస్సేన్‌మియా వాగు ఉన్నప్పటికీ గతంలో చుక్కనీరు వాడుకోలేని పరిస్థితి. మా బాధను గుర్తించి ఐదేండ్ల క్రితం కేసీఆర్ ప్రభుత్వం చెక్‌డ్యామ్‌ను నిర్మించింది. అప్పటి నుంచి సాగునీటికి ఢోకా లేదు. సోమవారం ఈ చెక్‌డ్యామ్‌ను పేల్చివేసేందుకు ప్రయత్నించిన దుండగులు మమ్మల్ని చూసి పరారైన్రు. వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలి.

- మేకల శ్రీనివాస్, రైతు, చీకురాయి

# విచారణకు హాజరుకాలేను

- ఈడీకి మెయిల్ చేసిన ఎమ్మెల్సీ కవిత
- సంక్రాంతి రోజున నోటీసులిచ్చిన ఈడీ

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోమవారం ఇచ్చిన నోటీసులకు ఎమ్మెల్సీ కవిత ప్రత్యుత్తరమిచ్చారు. మంగళవారం ఈడీ విచారణకు హాజరుకాలేనంటూ మెయిల్ ద్వారా ఆమె సమాధానమిచ్చారు. సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండగా తాను మళ్లీ ఈడీ విచారణకు రాలేనని స్పష్టం చేశారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో సంక్రాంతి రోజున ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎమ్మెల్సీ కవితకు నోటీసు ఇచ్చింది. ఇదే కేసులో గతంలోనూ పలుమార్లు నోటీసులు ఇచ్చిన ఈడీ అధికారులు.. పండగ పూట మరోసారి నోటీసులు ఇచ్చి మంగళవారం విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. గతంలో ఢిల్లీకి వెళ్లి ఈడీ ఎదుట కవిత రెండుసార్లు విచారణ ఎదుర్కొన్నారు. పీఎంఎల్ యాక్టులోని సెక్షన్ 50 కింద ఇప్పటికే కవిత స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అయితే మహిళను ఈడీ అధికారులు విచారించే పద్ధతిపై కవిత సుప్రీంకోర్టులో కేసు వేయడంతో గత నవంబర్ 20 వరకు ఆమెను విచారణకు పిలువొద్దని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఈ క్రమంలో మరోసారి ఈడీ అధికారులు నోటీసులు ఇవ్వడంతో మళ్లీ ఢిల్లీ మద్యంపాలసీపై చర్చ మొదలైంది. సుప్రీంకోర్టులో కవిత పిటిషన్ ఇంకా లిస్టు కాకపోవడం, సుప్రీంకోర్టు నుంచి స్పష్టమైన ఆదేశాలు ఏమీ రాకపోవడంతో మంగళవారం విచారణకు హాజరుకాలేనంటూ కవిత సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. ఇదే కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సైతం ఈడీ అధికారులు నాలుగుసార్లు నోటీసులు ఇచ్చారు. ఈ నెల 18న కేజ్రీవాల్ ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో హాజరుకావాల్సి ఉన్నది. లోక్‌సభ ఎన్నికల వేళ ఢిల్లీ మద్యం పాలసీ కేసును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓ అస్త్రంలా వాడుకునేందుకు ఈడీని పురికొల్పుతున్నదని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

# బండి సంజయ్‌పై కాంగ్రెస్ ఫిర్యాదు

- ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర ఎవరిదో చెప్పాలని డిమాండ్
- ఆధారాలు చూపకపోవడమూ నేరమేనని నేతల ఆరోపణ

కరీంనగర్ రాంనగర్, డిసెంబర్ 16: పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్ర సర్కారు కూలిపోతుందని ఆరోపణలు చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై కాంగ్రెస్ పార్టీ నేతలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్‌కు, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్.. పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతికి వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఎంపీ సంజయ్ వ్యాఖ్యలు ప్రజల, కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలను దెబ్బతిసేలా ఉన్నాయని, బాధ్యతాయుతమైన ఎంపీగా ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కార్‌ను కేసీఆర్ కూల్చే కుట్ర చేస్తున్నారని బండి సంజయ్‌కి ఎలా తెలిసిందో? ఆధారాలుంటే బహిర్గతం చేయాలని, చేయకుంటే అది కూడా నేరమే అవుతుందని చెప్పారు. దీనిపై విచారణ జరిపి చర్య తీసుకోవాలని కోరారు. బండి సంజయ్ వ్యాఖ్యల వెనుక దాగి ఉన్న కుట్రను ఛేదించాలని కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పురుమల్ల శ్రీనివాస్ కోరారు. ఏ ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేశారో, దాని వెనుక దాగి ఉన్న కుట్రను నివృత్తి చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ చిచ్చు

- తమకు అన్యాయం చేస్తున్నారని సీనియర్ల ఆగ్రహం
- బల్మూరి అభ్యర్థిత్వంపై వ్యతిరేకత
- దీపాదాస్ మున్షీతో మంత్రులు ఉత్తమ్, పొన్నం ప్రభాకర్ భేటీ
- బల్మూరికి వ్యతిరేకంగా ఎమ్మెల్యేల సంతకాల సేకరణ
- దిద్దుబాటు చర్యల్లో మున్షీ
- తాజా పరిస్థితులపై అధిష్ఠానానికి నివేదిక
- ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన ఆలస్యమయ్యే అవకాశం

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలు చిచ్చు రేపాయి. ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ పేర్లను అధిష్ఠానం ఖరారు చేసిందనే వార్తలతో సీనియర్లంతా ఏకమయ్యారు. అధిష్ఠానం నిర్ణయానికి వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. చాలామంది సీనియర్ నేతలు ఉండగా జూనియర్లకు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా బల్మూరి వెంకట్‌కు టికెట్ ఇవ్వడాన్ని సీనియర్లంతా మూకుమ్మడిగా వ్యతిరేకిస్తున్నారు. ఆయన పేరు బయటకు రాగానే సీనియర్లు గాంధీభవన్‌కు చేరుకున్నారు. నిన్న మొన్నటి వరకు ఎమ్మెల్సీ రేసులో అద్దంకి దయాకర్‌తోపాటు చిన్నారెడ్డి పేరు వినిపించింది. మంగళవారం హఠాత్తుగా బల్మూరి వెంకట్ పేరు తెరపైకి వచ్చింది. దీంతో ఇన్నాళ్లు మౌనంగా ఉన్న నేతలంతా ఒక్కసారిగా నిరసనగళం విప్పారు.

### బల్మూరికి వ్యతిరేకంగా సంతకాలు

ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అద్దంకి దయాకర్‌కు అవకాశం ఇవ్వడాన్ని సమర్థిస్తున్న సీనియర్ నేతలు, బల్మూరి వెంకట్‌కు ఇవ్వడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయన పేరు ప్రకటించినట్టు వార్తలు రాగానే గాంధీభవన్‌కు చేరుకున్న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, వేం నరేందర్‌రెడ్డి తదితరులు పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో భేటీ అయ్యారు. బల్మూరి పేరు ఖరారు చేయడంపై వారంతా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. పార్టీ కోసం కష్టపడ్డ ఎంతో మంది సీనియర్లను కాదని, వెంకట్‌కు టికెట్ ఇవ్వడమేంటని ప్రశ్నించినట్టు సమాచారం. సీనియర్ నేతలకు ఎవరికిచ్చినా తమకు అభ్యంతరం లేదని తేల్చి చెప్పినట్టు తెలిసింది. బల్మూరికి వ్యతిరేకంగా సీఎల్పీ కార్యాలయం నుంచే ఎమ్మెల్యేల సంతకాలు సేకరించినట్టు చెప్తున్నారు. ఎమ్మెల్సీ రేసులో ఉన్న మహేశ్‌కుమార్‌గౌడ్ టికెట్ల కేటాయింపుపై తీవ్రంగా స్పందించినట్టు సమాచారం. ఎన్ఎస్‌యూఐలో పని చేయడమే ప్రామాణికం అనుకుంటే తాను 30 ఏండ్ల కిందే అందులో పని చేశానని, అలాంటి తనను విస్మరించడం ఏంటని ప్రశ్నించినట్టు తెలిసింది. దీంతో దీపాదాస్ మున్షీ దిద్దుబాటు చర్యలకు దిగినట్టు సమాచారం. ఇక్కడి పరిస్థితిని అధిష్ఠానానికి నివేదించినట్టు తెలిసింది. మంగళవారం సాయంత్రం వరకు అధికారికంగా ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లు ఖరారు చేస్తారనే ప్రచారం జరగ్గా.. తాజా నిరసనలతో ప్రకటన ఆలస్యమయ్యే అవకాశం ఉన్నదని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

### సీఎం రేవంత్‌పై గుస్సా

ఎమ్మెల్సీ ఎన్నికలకు అభ్యర్థుల ఖరారులో సీనియర్లకు ఝలక్ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. తన మార్క్ రాజకీయాన్ని నడిపించినట్టు నిపుణులు చెప్తున్నారు. తన వారిని మాత్రమే పదవుల్లో ఉండేలా చేయడంలో భాగంగానే బల్మూరికి టికెట్ ఇప్పించారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో హుజురాబాద్ ఎన్నికల్లోనూ బల్మూరికి టికెట్ ఇప్పించిందే రేవంత్‌రెడ్డి అనే ఆరోపణలు వినిపించాయి. ఇప్పుడు మళ్లీ ఆయనే సీనియర్లను కాదని బల్మూరికి ఎమ్మెల్సీ టికెట్ ఇప్పించారని గాంధీభవన్ వర్గాల సమాచారం. బల్మూరిని అభ్యర్థిగా ప్రకటించడం ద్వారా పార్టీలో సీనియర్లకు చెక్ పెట్టడంతోపాటు పార్టీని తన గుప్పిట్లోకి తెచ్చుకోవచ్చని ఆయన భావిస్తున్నట్టు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

### రేసులో సీనియర్లు

అసెంబ్లీ ఎన్నికల సమయంలో చాలా మందికి టికెట్లు ఇవ్వకుండా ఎమ్మెల్సీ ఇస్తామని కాంగ్రెస్ అధిష్ఠానం హామీ ఇచ్చింది. ఇప్పుడు ఆ హామీని పట్టించుకోకుండా వ్యవహరించడంపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు తమకు అవకాశం దక్కుతుందని చాలా మంది సీనియర్‌నేతలు భావించారు. ముఖ్యంగా నిరంజన్, కోదండరెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్, అన్వేశ్‌రెడ్డి, నేరెళ్ల శారద, పటేల్ రమేశ్‌రెడ్డి, ఈరవత్రి అనిల్‌తోపాటు చాలా మంది నేతలు రేసులో ఉన్నారు. వీరందరిని కాదని బల్మూరి వెంకట్‌కు టికెట్ ఇవ్వడంపై సీనియర్లు మండిపడుతున్నారు. తాము పార్టీ కోసం కష్టపడలేదా? అని ప్రశ్నిస్తున్నారు.

### ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అద్దంకి, బల్మూరి?

- కాంగ్రెస్ అధిష్ఠానం ఖరారు చేసినట్టు సమాచారం

హైదరాబాద్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థుల